# దేవుడా! నీకు దిక్కెవరు?

- తురగా జయశ్యామల

అప్పుడే రెండు గంటలకు పైగా పక్క మీద అట్నుంచిటూ, ఇట్నుంచటూ పొర్లుతున్నాను నిద్ర రాక. ఇంటి చుట్టుపక్కలంతా పెట్టిన గ్రామ్ ఫోన్ ల్లోంచి, డిస్కో పాటలు, బ్రేక్ డాన్స్‌లూ, వీపు మీద దబదబా బాదుతున్నట్టు, గుండెల్లో రైళ్ళు పరుగెదుతున్నట్టుగా వున్న మ్యూజిక్, అప్పుడప్పుడూ మధ్యలో ఒకటీ అరా దేవుడి పాటలతో నానా హడావుడిగా వుంది.

చెవుల్లో దూది పెట్టుకున్నా, తల మీదుగా రెండు దిళ్ళు వేసుకున్నా ఆ శబ్దాలూ, ఆ పాటల హోరూ నా బుర్రలో గిర గిర తిరుగుతూ నిద్ర లేకుండా చేస్తున్నాయి. 'ఛ! ఛ! ఈ పండగలు, పూజలు ఎందుకొస్తాయో గాని ఈ పాటలతో పిచ్చెక్కిపోతోంది! మంచం మీద లేచి కూర్చుని జుట్టు పీక్కున్నానోసారి రెండు చేతులతో. అలా పీక్కోవడం అప్పటికది మొదటిసారేం కాదు. పాతిక సార్లు అయింది. కానీ, నా మొర వినే వారెవ్వరు! అక్కడికి గదికున్న కిటికీ తలుపులు, గుమ్మాలవి అన్నీ మూసేసాను. అయినా సరే ఆ దిక్కుమాలిన పాటలు నా బుర్రను చెద పురుగులా తొలిచేస్తున్నాయి.

టేబుల్ మీదున్న గడియారం వంక చూస్తే అప్పుడే పదకొండు గంటలవుతోంది. ఇంత రాత్రి అయినా ఆ పాట లేమిటి? ఈ పాటలేనా? ఇవి ఆగిపోతే రోడ్డు కడ్డంగా తెర కట్టేసి సినిమా వేసుకుంటారు. తెల్లారి అయిదు గంటల వరకు అదేపని. మగతగా పట్టిన నిద్ర లోంచి ఎప్పుడు మెలుకువ వచ్చినా, ఆ సినిమా డైలాగులు, ఫైటింగ్స్ యివీ విన్పిస్తుంటాయి! ఏమిటో! దేవుడి పేరు చెప్పి నానాగోల చేస్తారు! చక్కగా నిశ్శబ్దంగా పూజలు చేసుకున్నా మరేం చేస్తున్నా ఎవరు కాదంటారు? ఈ పట్టణాలలో అసలే వాతావరణ కాలుష్యంతో జీవితం సగానికి సగం తగ్గిపోతోందని శాస్త్రజ్ఞులంటున్నారు. దానికి తోడు ఈ మనుష్యులు అజ్ఞానంతో చేసే ఇటువంటి గందరగోళంతో మనిషి మరింత తొందరగా జీవితం చాలిస్తాడేమో! ఆ పాటలూ, ఆ గోల, గందరగోళం ఇంత దూరం నుంచే భరించ లేకుండా వుంటే, పాపం! అక్కడే వున్న భగవంతుడెలా భరిస్తున్నాడో ఏమిటో! అనుకున్నాను సానుభూతిగా.

మరో అరగంట వరకూ కూడా నిద్ర పట్టక అలా మంచం మీద పొర్లుతూనే వున్నాను...

* * *

ఎవరో తలుపు తట్టిన చప్పుడయితే నిద్ర లోంచి మెలుకువ వచ్చింది.

భార్యా, పిల్లలు ఎక్కడి వాళ్ళక్కడ నిద్ర పోతున్నారు. ఇంత రాత్రి పూట ఎవరొస్తారా? అని ఆలోచిస్తూనే లేచి వెళ్ళి తలుపు తీసాను. ముందు గదిలో లైటు వేసి.

గుమ్మంలో అవతల నుంచున్న మనిషిని చూడగానే, ముందుగా ఒక్కసారి దడుసుకున్నాను. తర్వాత భయమూ, ఆశ్చర్యమూ కలుగుతూండగా ఎగాదిగా చూశాను.

శిరస్సున ధగధగలాడుతున్న కిరీటం, చేతులకు, ముంజేతులకు మెళ్లోను పేర్లు తెలియని తళతళలాడుతున్న బంగారు ఆభరణాలు, పట్టు పీతాంబరం, పైన కండువా... నుదుట నామం... విచిత్రమైన ఆకారం!

"ఎవరండీ మీరు? ఎవరు కావాలి?" ఆయన రూపం, అలంకరణ చూసి భయంగా అడిగాను.

"నన్నే గుర్తు పట్టలేదుటయ్యా! నన్ను దేవుడంటార్లే. నువ్వు రచయితవి కదూ!" ఎందుకో గానీ విసుగ్గా అడిగాడు ఆయన.

"అవును స్వామీ.." అన్నాను భక్తితో, భయంతో.

"నీతో కాసేపు మాట్లాడిపోదామని వచ్చానయ్యా!" అంటూ దేవుడు సరాసరి లోపలకు వచ్చేసి సోఫాలో కూర్చున్నాడు తీరిగ్గా.

"దేవుడేమిటి? నాతో మాట్లాడడానికి రావడమేమిటి?" అయోమయంగా నేను తలుపు వేసి వెళ్ళి ఆయనకు ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నాను.

దేవుడు రెండు చేతులతో కణతలు రుద్దుకుంటూ "అబ్బబ్బా... ఈ పాటలూ, డాన్స్‌లూ... సినిమాలతో నాశతంవాప్పి తెప్పించేస్తున్నారు కదటయ్యా! కాస్తంత



చిత్రం :- వి. కృష్ణప్రియ విజయవాడ

24-8-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

తల నొప్పి మందేదయినా వుంటే ఇవ్వు!'' అనడిగాడు.

వెంటనే లేచి వెళ్ళి ఎదురుగా అల్మైరాలో వున్న అమృతాంజనం సీసా తెచ్చి ఆయనకిచ్చాను.

కొంచెం కొంచెంగా రాసుకున్నాక, పది నిముషాలు ఎవరూ మాట్లాడలేదు. నేను దేవుడి వంక ఇంకా అయోమయంగా చూస్తూనే వున్నాను.

''నువ్వు రచయితవి అన్నావు కదుటయ్యా! అంటే కథలు, గ్రటా రాస్తూంటావన్నమాట. నాకో సాయం చెయ్యాలోయి. ఏమిటో, నాకు పూజలూ అవీ అంటూ నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారీ భక్తులు. నేనసలు గీతలో ఏం చెప్పాను? భక్తిగా ఒక నమస్కారం చేసినా చాలు. ఫలమో, తృణమో అర్పిస్తే చాలునని. నన్నెంత ప్రశాంతంగా ప్రార్థిస్తే అంత ప్రసన్నుడినవుతానని. ఉహూ... నా పండగ వస్తోందంటే నాకే భయంగా వుందయ్యా! యింత ఆర్భాటాలూ, హడావుడీ ఎందుకు? ఇవన్నీ రచయితగా కొంతమందికయినా నువ్వు నీ రచనల ద్వారా చెప్పాలయ్యా'' అంటూ ఆగాడు దేవుడు.

''అలాగే స్వామీ! అలాగే! మాకే అనుకున్నాను. మీకు కూడా ఇదంతా బాధగా వుందా స్వామీ?'' అనడిగాను బాధగా ముఖం పెట్టి.

''బాధగా వుందా? అని నెమ్మదిగా అంటావేమిటయ్యా! ఒక విధంగా చూస్తే మీ మనుష్యులే అదృష్టవంతులయ్యా! పగలంతా పని చేసినా రాత్రి చక్కగా నిద్రపోయి విశ్రాంతి తీసుకుంటారు. నా సంగతలా కాదే! నా పేరు చెప్పి రాత్రి పగలూ ఇంత హడావుడి చేస్తుంటే ఎలాగయ్యా! మీ డ్యూటీలు మీరు చేసుకున్నట్లే, నా డ్యూటీ నేనూ చేయాలా? చేయాలంటే నాకూ కాస్తంత విశ్రాంతి, మనశ్శాంతి కావాలా? పది మంది కూర్చుని చక్కగా భోజనాలు చేసుకోవడమో! వంద మంది కూర్చుని నా నామ సంకీర్తన చేయడమో చేస్తే నాకు సంతోషం కదటయ్యా! ఈ స్టీరియోలేమిటి? ఈ డాన్సులూ, బ్రేక్ డాన్సులూ ఏమిటి... అబ్బబ్బ... నాకే మతి పోతోందయ్యా!''

'' అవును స్వామీ! అలాగే వుంటుంది. ఇదివరలో గ్రామ ఫోనులు పెట్టేవారు. అవి అంత బాధ పెట్టేవి కావు. కాని, ఇప్పుడు ఎలక్ట్రిక్ గిటార్ మ్రోగిస్తూ అంతెత్తున స్టీరియోలు. ఏ వీధిలో చూసినా, ఏ సందులో చూసినా అవే అయితే పిచ్చెక్కదా స్వామీ...!'' నా మాట పూర్తి కాలేదు.

''మరి ఎందుకు చెప్పరయ్యా అలాంటి వాళ్ళకి?'' చికాగ్గా అడిగాడు దేవుడు.


''అమ్మో! యింకేమన్నా వుందా స్వామీ!! మనది ప్రజాస్వామ్యం...ఎవరి స్వేచ్ఛ వారికి వుంది. ఏమన్నా అంటే భక్తులని అవమానించామనో...వాళ్ళ కులం వాళ్ళనో, మతం వాళ్ళనో ఏమన్నామనో...ఒకరినొకరు పొడుచుకుంటారు. ఇళ్ళు, ఊళ్ళు తగలెట్టుకుంటారు. మీకు తెలియంది ఏముంది స్వామీ! నారాయణా అంటే బూతుమాటగా వుందీ ప్రపంచంలో. ఎవరినీ ఏమీ అనలేము. చివరికి కడుపున పుట్టిన బిడ్డని కూడా ఏమీ అనకూడదు. అంటే విప్లవం వస్తొంది స్వామీ...!''

''అవునవును...చూస్తూనే వున్నాను...బొత్తిగా మనుష్య జాతి పాడయిపోయిందయ్యా! నా పేరు చెప్పకొని కూడా కొట్టుకుంటున్నారు. మనిషికి మనిషి తగల కూడదని గొడవలు చేస్తున్నారు. యితర పశు పక్ష్యాదులకంటే మనిషికి విజ్ఞానం అనేది ఎందుకిచ్చానయ్యా! ఉన్నతంగా బ్రతుకుతాడనే కదా!''

స్వయంగా దేవుడే ఎదురుగా కూర్చుని అలా అంటూంటే ఏం చెప్పను? సిగ్గుతో తల వాల్చి కూర్చున్నాను.

''నా మీద భక్తికంటె ఆడంబరాల మీద మోజు పెరిగి పోయిందయ్యా! ఒకరిని మించి మరొకరు చెయ్యాలనే ఆరాటంలో ఈ ఆర్భాటం చేస్తున్నారుగాని నిజంగా నన్ను తలచుకుని మనఃస్ఫూర్తిగా ఒక నమస్కారం చేస్తే చాలదా?''

''నిజమే స్వామీ! సామాన్య మానవులు పండగ



అంటేమా, పూజలంటేమ్మా సరదా! యివన్నీ సంఘానికీ, సంస్కృతికీ, సంప్రదాయాలకీ చిహ్నాలు కదా స్వామీ!

''అవునయ్యా! కాదని నేను మాత్రం అన్నానా? సంప్రదాయానికీ తగినట్టు భక్తి శ్రద్ధలతో చేయండి. కాని వీటిల్లో అనేక రాజకీయాలున్నాయే! మత కలహాలు, అంతఃకలహాలు... యింకా ఏవేవో కలహాలంటూ కుమ్ముకుంటున్నారే...దేవుడంటే నిజంగా భయం భక్తి వున్నాయంటావా వీళ్ళకి? నాకయితే ఎప్పుడెప్పుడు ఈ యుగాంతం చేద్దామాని వుంది'' కొంచెం చికాగ్గా, కొంచెం ఆవేశంగా అన్నాడు దేవుడు.

''బాబ్బాబు! ఆ పని చెయ్యండి స్వామీ త్వరగా! అనేక రకాల భయాలతో, టెన్షన్లతో దిన దిన గండంలా



వుంది. యింటి నుంచి బయటకెళ్ళే వరకు టెన్షన్, బయట నుంచి యింటి కొచ్చేవరకు భయం, రేషన్లో కిరోసిన్ దొరుకుతుందో లేదో, సినిమాకి టికెట్టు దొరుకుతుందో లేదో, యివ్వాళ ఒక మినిష్టరొచ్చి ఆయనగారి రూల్సన్నీ నెత్తిన రుద్దేస్తే, అవి అలవాటు పడకుండానే మరో మినిష్టరొచ్చేస్తున్నాడు పదవుల్లోకి. పిల్లలకి కాన్వెంట్ స్కూళ్ళ ఫీజులు...డ్రెస్‌లు...బండెడేసి పుస్తకాలు కొనాలంటే టెన్షన్, ఏమిటో.. ఒకటి కాదు స్వామీ చెప్పేందుకు. పాటి మనిషిని పలకరించాలంటే భయం. పొరపాటున వాడి కులం గురించో, మతం గురించో మాట్లాడామంటే ఏ గన్ పెట్టి పేలుస్తాడో, మీదకు ఏ బాంబు విసురుతాడో నని భయం...భయం...భయం...భయం తప్ప బ్రతుకులో ఏముంది స్వామీ! ఈ యుగం అంతమయి, మరల కొత్త యుగం అవతరిస్తే అప్పుడన్నా మనుష్యులు మనుష్యులుగా బ్రతుకుతారేమో!''అన్నాను ఏకబిగిన.

''ఏమిటయ్యా! నా బాధ చెప్పకుందామని నేను వస్తే నీ బాధలన్నీ ఏకరువు పెడుతున్నావు?'' అనడిగాడు దేవుడు నవ్వుతూ.

''మరి ఏం చెయ్యమంటారు స్వామీ! ఘోర తపస్సు చేయకపోయినా యిలా ప్రత్యక్షమయ్యారు మీరు. వరాలు ఏమీ కోరనుగాని, నా మనసులో బాధ చెప్పకుంటే కాస్తంత భారం తీరుతుందని...''

''నీ భార్య వుంది కదయ్యా!''

''భార్యా పిల్లలు వుంటే మటుకేమిటి స్వామీ! ఎవరి గొడవ వారిదీ

ప్రపంచంలో...అదేదో...యుగాంతం అన్నారే...అదేదో త్వరగా చూడండి స్వామీ...!

"అదే...ఆలోచిస్తున్నానయ్యా నేనూను. యిలా యింకొన్ని శతాబ్దాలు మాత్రమే...ఇప్పటికే ప్రారంభ మయింది కదయ్యా, నా ప్రయత్నం అందుకే చూడు...ప్రపంచంలోనే జనాభా ఎలా తగ్గిపో తూందో...రోజూ విమానాలు కూలీ, రైళ్ళు పడీ, భూకంపాలు వచ్చి, ఒకరి నొకరు కొట్టుకునీ...పొడుచు కునీ ఎంత జన నష్టం కావడం లేదు? అయినా నేను చేసేదేమిటయ్యా! నిమిత్త మాత్రుడినే. భూగోళాన్ని నాశనం చేసుకోడానికి ఎవరి మార్గం వాళ్ళే కనిపెట్టు కుంటున్నారుగా అణుబాంబులు తయారుచేసు కొని..." అన్నాడు చిన్నగా దేవుడు.

"నిజమే స్వామీ...నిజమే! మనిషికి తెలివితక్కువ ఎంత నష్టం కలుగ చేస్తుందో అతి తెలివి కూడా అంతే నష్టం కలుగ జేస్తుంది. అతి ఎందులోనూ పనికిరాదు స్వామీ...!"

"అదే కదయ్యా! నేను చెప్పింది. మూగగా, మౌనంగా ఆరాధించి నావల్ల లాభం పొందిన భక్తులెందరు లేరు? నన్ను కొలవాలంటే ఈ ఆడంబరాలు అక్కర్లే దయ్యా! ఏమయినా మీ పనే హాయి. ఇష్టం లేకపోతే చక్కగా యిలా తలుపులన్నీ బంధించుకుని ఆ గొడవ నుంచి తప్పించుకోగలరు. కాని నా పని అలా కాదే. ఏదో ఓ చోట వుండే వాడిని కానయ్యే! సర్వాంతర్యామిని కదా! అంతటా నేనే వున్నప్పుడు నేను యింక వేరే తప్పించుకొని ఎక్కడికి పోగలను? భరించక తప్పదు కదా!" విచారంగా ముఖం పెట్టాడు దేవుడు.

నిజమేనని పించింది 'పాపం! దేవుడు' అనుకున్నాను.

"సరేనయ్యా! ఇంక వెళ్ళొస్తాను. నేను చెప్పినవన్నీ తప్పక రాయి. అన్నట్టు యిందాకటి నుంచి చెబుదామని మర్చిపోయాను. బాగా ఆకలిగా వుంది. తినడానికి ఏమైనా పెట్టవయ్యా!" అనడిగాడు దేవుడు.

"అదేమిటి స్వామీ! ఉదయం నుంచీ వాళ్ళు మీకు నైవేద్యం కూడా ఏమీ పెట్టలేదా?" ఆతురతగా అడిగాను.

"పెట్టారయ్యా! ఒకటా రెండా! డజన్లకొద్దీ కొబ్బరి కాయలు కొట్టారు...వందల కొద్దీ అరటి పళ్ళు పెట్టారు. నాకూ చాలా ఆకలిగా వుంది. కాని, ఆ గొడవగా...గందరగోళంగా వున్న ఆ వాతావరణంలో తినబుద్ధికాక తినలేదు. అది కూడా కాక నాకు బాధగా వుండి కూడా తినలేక పోయాను."

"బాధా...ఏమిటి స్వామీ!"

"అదేనయ్యా! నా పేరు చెప్పుకుని ఉత్సవాలు చేసుకుంటున్నారు. నా మీద పాటలుగాని, భజనలు గాని, కీర్తనలుగాని లేకుండా, ఆ సినిమా పాటలూ అవీ అంత బిగ్గరగా పెట్టుకుంటా రేమిటా అని."

"నిజమే, స్వామీ! అదొక అజ్ఞానం. ఈసారి వీలయినంత మందికి చెబుతాను. జరుగుతున్న పొర పాటు ఏమిటో ముందు మీకు తినడానికేమయినా తెస్తానుండండి స్వామీ!" అంటు కిచెన్‌లోకి నడిచాను.



టేబులు మీదున్నబుట్ట లోంచి రెండు అరటి పళ్ళు, ఫ్రిజ్ లోంచి ఓ గ్లాసు పాలు తీసుకొని వచ్చి దేవుడి కిచ్చాను.

పళ్ళు తిని, పాలు త్రాగి తృప్తిగా చూస్తూ "యింక వెళతానోయి!" అంటూ దేవుడు వెళ్ళిపోయాడు.

తలుపు లేసుకున్నాను నేను.

* * *

"ఏమండోయ్! ఏడు గంటలు దాటిపోతోంది. లేవ లేదేం యింకా! ఆఫీసుకి వెళ్ళక్కర్లేదా! యివ్వాళ" శ్రీమతి కంఠం కంచు గంటలా వినిపించగానే మెలుకువ వచ్చింది నాకు. అంతవరకు జరిగినదంతా కలలోనన్న విషయం గుర్తుకు వచ్చింది.

కలలో...నాకూ దేవుడికీ జరిగిన సంభాషణంతా మననం చేసుకున్నాసారి.

అప్పటికే చుట్టుపక్కల ఉత్సవాలు జరుగుతున్న చోటు నుంచి స్టీరియోల్లో పాటలు వినిపిస్తున్నాయి, చెవులు తుప్పు వదిలేలా!

పాపం! భగవంతుడు కూడా బాధ పడుతున్నాడు. మనుష్యులకి బాధలొస్తే దేవుడే దిక్కనుకుంటాం. కాని దేవుడికే బాధ వస్తే...

"పాపం! దేవుడూ! నీకు దిక్కెవ్వరు?" అను కుంటూ లేచి కాలకృత్యాలు తీర్చుకోడంలో పడ్డాను.


## ముచ్చటైన మెరుపు కలిసి వచ్చే పొదుపు




# స్వర్ణ

మీ పాత్రలకు
కొత్తమెరుగులు చేకూర్చి
మీ ఖర్చుకు మించిన
ఫలితాన్ని
చేకూరుస్తుంది.

## క్లీనింగ్ పౌడర్

పొదుపును దృష్టిలో పెట్టుకొని మా లేబరేటరీలో ఎంతో శ్రమ, వ్యయానికి ఓర్చి స్పెషల్ ఫార్ములాతో తయారుచేయబడినది.

**NATIONAL CHEMICAL ENTERPRISES**
T.B.ROAD, TENALI, GUNTUR Dist (A.P) PH:5397

TARA.298

మా క్లీనింగ్ పౌడర్ మార్కెట్ చేయుటకు ఆర్థికస్థోమత కలిగి, ఏజెన్సీ లైనులో అనుభవముగలవారి నుండి మరియు తక్కువ పెట్టుబడి కలిగి, కష్టపడి పనిచేసి మార్కెట్టులో పేరు ప్రఖ్యాతులు, డబ్బు సంపాదించాలి అనే దృక్పథము కలిగిన ఉత్సాహవంతులైన వారినుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.